సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 5 । జూలై । 2023



చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి. మార్కెట్‌కు 777 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



99 శాతం పింఛన్ల పంపిణీ

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ భాగంగా నాలుగోరోజు మంగళవారం నాటికి జిల్లాలో 99 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

8లో



జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

సత్యసాయిసేవలో గవర్నర్



సత్యసాయి మహాసమాధి చెంత రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రశాంతి నిలయం: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం సత్యసాయి సన్నిధిలో గడిపారు. సోమవారం రాత్రి ప్రశాంతి నిలయం చేరుకున్న ఆయన శాంతిభవన్ అతిథి గృహంలో బస చేశారు. మంగళవారం ఉదయం 9.45 గంటలకు సాయికుల్వంత్ సభా మందిరం చేరుకుని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా కార్యక్రమాలను, నిత్యం సాయికుల్వంత్ సభా మందిరంలో జరిగే అధ్యాత్మిక సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు గవర్నర్‌కు వివరించారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.15 గంటలకు శాంతిభవన్ అతిథి గృహం నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక కాన్వాయ్‌లో బెంగళూరు వెళ్లారు. కలెక్టర్ అరుణ్ కుమార్, ఎస్పీ మాధవ రెడ్డి గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

జిల్లాకు వర్ష సూచన

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో బుధ, గురువారాల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షాలు పడవచ్చని పేర్కొన్నారు. కనీసం 20 మి.మీ వర్షపాతం నమోదైతే పంటలు విత్తుకునేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు. ఖరీఫ్ సాగుకు నెలాఖరు వరకు సమయం ఉందని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ 'పురం' సమన్వయకర్తగా దీపిక



హిందూపురం టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా కురుబ సామాజిక వర్గానికి చెందిన టీ.ఎన్.దీపిక నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెల్లువడ్డాయి. హిందూపురం మండలం పెద్దగుద్దంపల్లికి చెందిన దీపిక బెంగళూరులో ఎంబీఏ పూర్తి చేసి బెంగళూరు యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేసేవారు. ప్రజాసేవ చేయాలని భావించిన ఆమె ఇటీవల ఉద్యోగానికి రాజీనామాచేసి రాజకీయాల్లోకి వచ్చారు. ఆమె భర్త వేణురెడ్డి వైఎస్సార్ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ వైఎస్సార్ సీపీ పటిష్టతకు ఆవిర్భావం నుంచీ పనిచేశారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలందరినీ కలుపుకుపోతానని, హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురువేయడానికి తన శాయశక్తుల కృషి చేస్తానని వెల్లడించారు.

పట్టణ వైద్యం.. పేదలకు వరం



ఇతని పేరు రాము. చేనేత కార్మికుడు. బీపీ, షుగర్‌తో బాధపడుతున్న రాము గతంలో రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు, చికిత్స చేయించుకోవాలంటే నెలనెలా ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి రూ.2 వేల దాకా ఖర్చు చేసేవాడు. జగన్ సర్కార్ అందుబాటులోకి తెచ్చిన అర్బన్ హెల్త్ సెంటర్ వల్ల వైద్య పరీక్షలతో పాటు మందులను ఉచితంగా పొందుతున్నాడు.



ఇతను రవీంద్ర. ధర్మవరం ఎల్‌సీకే పురం నివాసి. అతని కుమారుడు నిషాంత్ తీవ్రమైన జ్వరం వస్తుండటంతో అర్బన్‌హెల్త్ సెంటర్‌కు వెళ్లాడు. రక్త పరీక్ష చేయించిన వైద్యులు డెంగీ జ్వరం వచ్చినట్లు గుర్తించి ఉచితంగా మందులు అందించి పంపారు. అదే ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి ఉంటే రూ.వేలకు వేలు వెచ్చించాల్సి వచ్చేది.

...ఇలా జిల్లా వ్యాప్తంగా 18 అర్బన్ హెల్త్ సెంటర్లు పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నాయి. నిరుపేదకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా సాంత్వన చేకూరుస్తున్నాయి.

కార్పొరేట్‌కు దీటుగా అర్బన్ హెల్త్ సెంటర్ల సేవలు

- ఓపీ సేవలతో పాటు 60 రకాల వైద్య పరీక్షలు
- ప్రతి సెంటర్‌లో వైద్యుడు, సిబ్బంది
- వారంలో ఒకరోజు స్పెషలిస్ట్ వైద్యుడి సేవలు
- దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారికి ప్రయోజనం
- జిల్లాలో సేవలందిస్తున్న 18 అర్బన్ హెల్త్ సెంటర్లు
- ప్రారంభానికి సిద్ధంగా మరో 12 వైద్యశాలలు

ధర్మవరం: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... పట్టణ పేదలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు అర్బన్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటి ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన సేవలందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఏర్పాటైన 18 అర్బన్ హెల్త్ సెంటర్లలో రెగ్యులర్ వైద్యుడితో పాటు సిబ్బందీ అందుబాటులో ఉంటారు. వారంలో ఒకసారి స్పెషలిస్ట్ వైద్యుడి ద్వారా సేవలందిస్తున్నారు. దాదాపు 60 రకాల రక్త పరీక్షలతో పాటు ఉచితంగా మందులను సైతం అందిస్తూ నిరుపేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారు.

త్వరలో మరిన్ని అందుబాటులోకి...

ప్రస్తుతం ధర్మవరంలో 6, కదిరిలో 4, హిందూపురంలో 5, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తిలో ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్లు పనిచేస్తున్నాయి. మరో 7 సెంటర్లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. నిర్మాణదశలో మరో 5 అర్బన్ హెల్త్ సెంటర్ ఉన్నాయి. త్వరలోనే వీటిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ప్రతి సెంటర్‌లో ఓపీ-1, ఓపీ-2, లేబర్‌రూం, మైనర్ ఓటీ రూం, ల్యాబ్, యోగా గది, ఫార్మా గది, మినీ వార్డులతో కలిపి 10 గదులు ఉంటాయి.

నిపుణులతో వైద్య సేవలు

వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో ఒక మెడికల్ ఆఫీసర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సేవలు అందిస్తారు. వీరితో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, అటెండర్ సేవలందిస్తారు. వీరు కాకుండా ప్రతి సోమవారం ఒక స్పెషలిస్టు డాక్టర్ సేవలందిస్తారు.

వైద్య సేవలు ఇలా

అర్బన్‌హెల్త్ సెంటర్‌లలో జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలతో పాటు గర్భిణులు, బాలింతలకు, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారికి రెగ్యులర్ డాక్టర్ వైద్య సేవలందిస్తారు. ఒకవేళ క్రిటికల్ కేసు అయితే టెలీహబ్ ద్వారా వీడియో కాల్ ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యులతో మాట్లాడి వైద్య సేవలందిస్తారు.





ధర్మవరంలోని ఎల్‌సీకేపురం అర్బన్‌హెల్త్ సెంటర్ (ఇన్‌సెట్‌లో) బాలుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్‌నాయక్

ల్యాబ్‌లో 60 రకాల వైద్య పరీక్షలు

బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ల్యూకోసైట్ కౌంట్, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, ప్లేట్‌లెట్ కౌంట్, ఈఎస్ఆర్, సీటీ, బీటీ, బ్లడ్ యూరియా, సీరం, క్రియాటిన్, బిలిరుబిన్, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, ఆల్కలైన్, పాస్పేట్, టోటల్ ప్రొటీన్, సీరం అల్బుమిన్, సీరం హెచ్‌డీఎల్, ఏఎఫ్‌బీ (కఫం), మలం విశ్లేషణ కోసం ఓవీఏ, సీవైఎస్‌టీ, గర్భిణులకు మూత్ర పరీక్షలతో సహా మొత్తం 60 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారు.

అన్ని రకాల చికిత్సలు అందిస్తున్నాం



పేదలకు అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తున్నాం. ముఖ్యంగా ల్యాబ్ ద్వారా రక్తపరీక్షలు నిర్వహించి దీర్ఘకాలిక రోగులకు ఎప్పటికప్పుడు మందులను ఉచితంగా అందజేస్తున్నాం. కొంత ఇబ్బందికరంగా ఉన్న కేసులను పర్యవేక్షణలో ఉంచుకుని వైద్యం అందిస్తున్నాం. త్వరలోనే ఆస్పత్రిలో 10 పడకలు సిద్ధం చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు. సరిపడా వైద్య సిబ్బంది ఉండటం వల్ల రోగులకు సత్వరం వైద్య సేవలందిస్తున్నాం.

–సురేష్‌నాయక్, మెడికల్ ఆఫీసర్, ఎల్‌సీకేపురం అర్బన్‌హెల్త్ సెంటర్, ధర్మవరం

ప్రతి సెంటర్‌లో 10 పడకలతో వైద్యం



అర్బన్ హెల్త్ సెంటర్‌ల వల్ల మురికివాడలు, శివారు ప్రాంతాల వారికి, పేద వారికి సత్వరం ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాం. ప్రతి సెంటర్‌లో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారు. త్వరలో ప్రతి సెంటర్‌కు 10 పడకలను అందుబాటులోకి తెచ్చి వైద్య సేవలు మరింత విస్తృతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

–ఎస్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

- జయంతి వేడుకల్లో కలెక్టర్ అరుణ్‌బాబు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ అల్లూరి నిలువెత్తు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం, మన్యం ప్రజల హక్కుల కోసం పోరాడి 27 ఏళ్ల వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. అడవి బిడ్డలపై తెల్లదొరల అకృత్యాలను చూసి ఆయుధం పట్టాడని, అన్ని ప్రాంతాలకు సుపరిపాలన అందాలని కలలు కన్నాడన్నారు. మన్యం వీరుడు తిరిగిన ప్రాంతంలో తాను పని చేశానని, ఆ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు గొప్ప అనుభూతి కలిగిందన్నారు. అల్లూరిని స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఒక జిల్లాకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రాం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పీఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి పాల్గొన్నారు.

పుట్టపర్తి అభివృద్ధికి సహకరించండి

- గవర్నర్‌ను కోరిన ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ప్రశాంతి నిలయం: పుట్టపర్తిని అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఉదయం ఆయన ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథిగృహంలో గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ప్రాంత అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పుట్టపర్తిని పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు, అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు సహకారం అందించాలని కోరారు.

అవ్వాతాతలకు 'కంటి వెలుగు'

- ఉమ్మడి జిల్లాలో 3 లక్షలకు చేరువలో నేత్ర పరీక్షలు
- అవసరమైన వారికి ఆపరేషన్లు, కళ్లద్దాలకు ఎంపిక
- క్యాటరాక్ట్ సర్జరీల్లో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లాకు మూడో స్థానం



గన్నేవారిపల్లి కాలనీలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

జిల్లాలో జూన్ 30 నాటికి 'కంటి వెలుగు' ఇలా..

60 ఏళ్లు దాటిన వారి సంఖ్య	2,22,724
కంటిపరీక్షలు చేయించుకున్న వారు	1,49,424
అద్దాలు ఆర్డర్ చేసింది	69,447
అద్దాలు తీసుకున్న వారు	29,076
క్యాటరాక్ట్ సర్జరీకి ప్రతిపాదన	8,404
క్యాటరాక్ట్ సర్జరీ చేయించుకున్న వారు	8,114

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గ్రామీణ ప్రాంతాల్లో నాలుగేళ్లకు ముందు కంటిచూపు మందగిస్తే పేదలు వైద్యం చేయించుకునే పరిస్థితి లేదు. మసక చూపుతోనే కాలం వెళ్లదీయాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వం వచ్చాక 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమంతో 60 ఏళ్లు దాటిన అవ్వాతాతల ముఖంలో వెలుగు కనిపించింది. వైద్యపరీక్షలు మొదలుకొని ఆపరేషన్లు, కంటి అద్దాల పంపిణీ అన్నీ ఉచితంగానే చేసి వారి కళ్లలో కాంతి నింపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కంటి పరీక్షలు చేయించుకున్న వారి సంఖ్య 3 లక్షలకు చేరువలో ఉండటం గమనార్హం. యుద్ధ ప్రాతిపదికన నడుస్తున్న కంటి వెలుగు కార్యక్రమం దేశంలోనే మొదటిసారి ఆంధ్రప్రదేశ్‌లో మొదలైంది. క్యాటరాక్ట్ సర్జరీల్లో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా మూడో స్థానంలో నిలిచింది.

అవ్వా తాతల ముఖాల్లో చిరునవ్వు

అరవై ఏళ్లు దాటిన వారు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 4.60 లక్షల మందికి పైనే ఉన్నారు. వీరిలో చాలామంది కంటిచూపు సరిగా లేక బాధపడుతున్నారు. చాలామంది వైద్యపరీక్షలు చేయించుకోలేని, కంటి అద్దాలు తెచ్చుకోలేని పరిస్థితిలో ఉన్నారు. అలాంటి అవ్వాతాతల కోసం కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 1.20 లక్షల కళ్ల అద్దాలకు ప్రభుత్వం ఆర్డర్ చేసింది. శుక్లాలతో బాధపడే అవ్వాతాతలకైతే ఉచితంగా ఆపరేషన్లు చేసి కళ్ల అద్దాలు ఇచ్చారు. ఇప్పటివరకూ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 15 వేల దాకా సర్జరీలు చేశారు. త్వరలోనే 60 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ కంటిపరీక్షలు పూర్తిచేసే లక్ష్యంతో ముందుకెళుతున్నారు.

ఆపరేషన్‌తోనే చూపొచ్చింది



కళ్లు సరిగా కనిపించక, ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక ఇబ్బంది పడ్డాను. ఇలాంటి పరిస్థితుల్లో నాకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారు. అద్దాలు కూడా ఇచ్చారు. మాలాంటి వారి కోసం ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని తీసుకొచ్చిన సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఎర్రమ్మ, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ మండలం

పరీక్ష చేసి అద్దాలు ఇచ్చారు



ఆరు నెలల క్రితం మా ఊర్లో రామాలయం వద్ద కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. కళ్లు మసగ్గా కనిపిస్తుంటే అక్కడికి వెళ్లాను. వైద్యులు పరీక్ష చేశారు. అద్దాలు వాడాల్సి ఉంటుందని, ప్రభుత్వమే పంపుతుందని చెప్పారు. 10 రోజుల్లోనే ఆశా కార్యకర్త మా ఇంటి వద్దకే వచ్చి అద్దాలు ఇచ్చింది. మా ఆయనకు కూడా ఉచితంగా అద్దాలు అందజేశారు.

– ఏ.వెంటకలక్ష్మమ్మ, గాండ్లపెంట

కంటి వెలుగు క్యాంపులు వేగవంతం

'కంటి వెలుగు' క్యాంపులు జిల్లాలో వేగవంతం చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. దృష్టిలోపంతో బాధపడుతున్న వారికి స్క్రీనింగ్ చేసేందుకు ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నారు. కళ్లద్దాలు, ఆపరేషన్ అవసరమైన వారిని ఎంపిక చేస్తున్నారు. ఇప్పటికే వేలాది మందికి శస్త్ర చికిత్సలు చేశాం. ప్రస్తుతం క్యాంపుల్లో కంటి అద్దాలు అవసరమని గుర్తించిన వారికి త్వరలోనే అద్దాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఎంహెచ్ఓ

మేఘమా కురవవే

నైరుతి పెద్దగా ప్రభావం చూపడం లేదు. విత్తనకార్తె దాటిపోతోంది. కారు మబ్బులు కమ్ముకున్నా ఆషాఢం గాలులు చెదరగొడుతున్నాయి. నేటికీ పదునైన వర్షం కురవకపోవడంతో రైతులు విత్తనాలు సిద్ధం చేసుకుని వానకోసం ఎదురు చూస్తున్నారు

- వర్షం కోసం రైతన్న ఎదురుచూపు
- ప్రభావం చూపని నైరుతి రుతుపవనాలు
- పదునైన వర్షం కరువు

పుట్టపర్తిలో కమ్ముకున్న మేఘాలు



పెదపల్లి వద్ద పొలాన్ని దుక్కిచేస్తున్న రైతన్న



పుట్టపర్తి అర్బన్: వర్షాధారంపైనే ఆధారపడి జిల్లా రైతులు పంటలు సాగుచేస్తారు. వాన కురిస్తేనే పొలాలన్నీ పంటలతో కళకళలాడేది. కానీ ఈ సీజన్‌లో ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గస్థాయిలో వర్షం కురవలేదు. దీంతో వర్షాల కోసం అక్కడక్కడా కప్పల ఊరేగింపు, బొడ్రాయికి నీళ్లు పోయడం, బోనాలు ఎత్తడం తదితర పూజలు చేస్తున్నారు. అయితే ఇప్పటికీ సమయం మించి పోలేదని నెలాఖరు వరకూ అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పెట్టుబడి సాయం..సబ్సిడీ విత్తనం

ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసింది. జిల్లాకు ఏకంగా 97,565 క్వింటాళ్ల విత్తన వేరుశనగ అందజేసింది. అలాగే వైఎస్సార్ రైతు భరోసా మొత్తాన్ని ఖాతాల్లో జమ చేసింది. ఆర్‌బీకేల్లో ఎరువులు సైతం సిద్ధంగా ఉంచింది. ఇక ఖరీఫ్‌కు సంబంధించి వాతావరణ బీమా మరో 3 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. దీంతో రైతన్న పంటల సాగుకు సన్నద్ధంగా ఉన్నాడు.

10 వేల హెక్టార్లలో పంటలు

సకాలంలో వర్షాలు కురిస్తే జిల్లా వ్యాప్తంగా 3.23 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రానున్నాయి. అయితే సరైన వర్షాలు లేక ఇప్పటికీ కేవలం 10 వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగులోకి వచ్చాయి. ప్రస్తుతానికి బోరుబావుల కింద సాగుచేసిన వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం, చిరుధాన్యాల పంటలకు స్ప్రింక్లర్లు, డ్రిప్‌ల ద్వారా నీరందిస్తున్నారు.

క్లుప్తంగా

శాకంబరీ.. శరణు



ధర్మవరం అర్బన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు మంగళవారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. 300 కేజీల కూరగాయలతో వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సకాలంలో వర్షాలు కురిసి అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుతూ అమ్మవారిని పూజించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ, ఆర్డీఓ

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కళ్యాణదుర్గంలో సభ ఏర్పాట్ల పనులు ఊపందుకున్నాయి. స్థానిక ధర్మవరం రోడ్డులోని హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకూ మంగళవారం చేపట్టిన రోడ్డు మరమ్మతులు, విద్యుద్దీకరణ, బారికేడ్ల ఏర్పాటు పనులను ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి పరిశీలించారు. హెలీప్యాడ్ వద్ద సీఎంను స్వాగతించే ముఖ్య నేతల వివరాలు, వారు వేచి ఉండడానికి టెంట్లు, వీవీఐపీ, వీఐపీ గ్యాలరీల తదితర అంశాలపై స్థానిక అధికారులతో సమీక్షించారు.

జ్యువెలరీ వర్క్ షాపులో చోరీ

ఓడీ చెరువు: మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలోని కబీరుల్లా జ్యువెలరీ వర్క్‌షాపులో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. కబీరుల్లా తన కుటుంబ సభ్యులతో కలసి మూడు రోజుల క్రితం గుల్బర్గా వెళ్లాడు. తిరిగి మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. తాళం తీసి లోపలికి వెళ్లగా బీరువా బద్దలు కొట్టిన స్థితిలో కనిపించింది. అందులో ఉన్న 750 గ్రాముల వెండి, రూ. 65 వేల నగదు కనిపించలేదు. పక్కంటి మెట్లపై నుంచి దొంగలు పైఅంతస్తులోకి ప్రవేశించినట్లు గుర్తించారు.

వరుణుడిపైనే ఆశలన్నీ!

- టీబీ డ్యాంకు పెరగని ఇన్‌ఫ్లో
- అన్నదాతల ఆందోళన
- వానల కోసం ఎదురుచూపు
- నార్లు పోయడానికి అదను దాటుతుందనే కలవరం

బొమ్మనహాళ్: రాయలసీమకు సాగు, తాగునీరు అందించే తుంగభద్ర జలాశయం(టీబీడ్యాం)లో రోజురోజుకూ నీటి మట్టం పడిపోతోంది. హెచ్చెల్సీ ద్వారా ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లోని 2.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ముఖ్యమైన జలవనరులో జూలై మొదటి వారం వచ్చినా మూడు టీఎంసీలకు మించి నీరు నిల్వ లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టుకు సరైన సమయంలో నీరు అందుతాయో? లేదో? అన్న సందిగ్ధంలో పడ్డారు.

ఎగువ ప్రాంతాల్లో కానరాని వరుణుడు..

కర్ణాటకలోని తుంగభద్ర జలాశయ ఎగువ ప్రాంతాలైన హరిహర, శివమొగ్గ, తీర్థహళ్లి, ఆగుంబేలో తీవ్ర వర్షాభావం నెలకొంది. కొన్ని రోజులుగా వర్షాలు పడడం లేదు. దీంతో డ్యాంకు ఇన్‌ఫ్లో గణనీయంగా పెరగడం లేదు. వానలు పడి వరద వస్తేనే ఇన్‌ఫ్లో పెరుగుతుంది. ప్రస్తుతం 798 క్యూసెక్కుల నీరు మాత్రమే డ్యాంలో చేరుతోంది. ఈ క్రమంలోనూ, కర్ణాటకలోని హొస్పేట్, కమలాపురం, సిరుగుప్ప తదితర ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అత్యవసర నిమిత్తం రోజూ 136 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండడం గమనార్హం.

40 రోజుల ముందే నార్లు..

జిల్లాలోని బొమ్మనహాళ్, కణేకల్లు, డీ హీరేహాళ్, విడపనకల్లు మండలాల రైతులు కాలువకు నీరు వస్తాయన్న ఆలోచనతో 40 రోజుల ముందే బోర్ల కింద వరి, మిరప నారు పెంచుకుంటారు. గతేడాది వర్షాలు బాగా పడ్డాయి. ఈ ఏడాది కూడా పరిస్థితి అలానే ఉంటుందనే నమ్మకంతో కొందరు బోర్ల కింద నారు పెంచుకున్నారు. అయితే, జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగకపోవడం చూసి వారిలో కలవరం మొదలైంది. ఆరుద్ర కార్తెలో నార్లు పెంచుకుంటే పంట బాగా పండుతుందని రైతుల నమ్మకం. ఈ సారి అలాంటి పరిస్థితి లేకపోవడంతో నైరాశ్యం కమ్ముకుంటోంది.



తుంగభద్ర జలాశయం

జలాశయం సామర్థ్యం 1,632 అడుగులు

	గతేడాది ఇదే సమయానికి
ప్రస్తుత నీటిమట్టం 1,576.65 అడుగులు	నీటిమట్టం 1614.90 అడుగులు
నిల్వ ఉన్న నీరు 3.060 టీఎంసీలు	నిల్వ ఉన్న నీరు 48.180 టీఎంసీలు
ఇన్‌ఫ్లో 798 క్యూసెక్కులు	ఇన్‌ఫ్లో 11,370 క్యూసెక్కులు

రోజూ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాం



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల కావొస్తున్నా తుంగభద్ర జలాశయంలో నిల్వ ఉండే నీరు మూడు టీఎమ్‌సీలు కూడా దాటడం లేదు. దీంతో బోర్ల కింద నార్లు పోసుకోవడానికి వెనుకంజ వేస్తున్నాం. పంటకు ఈ సారి పూర్తి స్థాయిలో నీరు అందుతాయా లేదా అన్న అనుమానం నెలకొంది. వరుణుడు కరుణించాలని రోజూ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాం.

– హనుమేష్, రైతు, దేవగిరి

వానల కోసం ఎదురుచూస్తున్నాం



తుంగభద్ర జలాశయానికి నీరు వస్తుందని రైతులంతా ఎదురు చూస్తున్నాం. గత సంవత్సరం వర్షాలు బాగా పడడంలో జలాశయంలోకి వరద పోటెత్తింది. ఈ సారి డ్యాంలో నీరు చాలా తక్కువ ఉన్నాయి. ఈ క్రమంలోనూ తాగునీటి అవసరాల కోసం 136 క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలో నీరు పెరిగితేనే నార్లు పోసుకుంటాం.

– ప్రసాద్‌రెడ్డి, రైతు, ఉద్దేహాళ్



హెచ్చెల్సీ ఆయకట్టు భూములు

గంజాయి విక్రయాలపై నిఘా పెంచండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

గోరంట్ల: గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా పెంచాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన గోరంట్ల పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు గురించి సీఐ సుబ్బరాయుడుతో ఆరా తీశారు. కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ రికార్డులను పరిశీలించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, విధించే శిక్షలపై హోర్డింగులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఎర్రచందనం రవాణా కేసుల్లో పెండింగ్‌లో ఉన్న వారెంట్లను అమలు చేయాలని, స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. మట్కా, జూదం, అక్రమ మద్యం తయారీపై నిఘా పెంచాలన్నారు. స్టేషన్‌కు వచ్చేవారిపట్ల సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

మడకశిరలో కర్ణాటక వాసి మృతి

మడకశిర: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి సమీపంలో మంగళవారం కర్ణాటకకు చెందిన రామాంజి(45) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకా సిద్దేపల్లి క్రాస్‌కు చెందిన కొంతమంది రొళ్లలో స్థిరపడ్డారు. మడకశిర ప్రాంతంలో స్టీల్ పాత్రల వ్యాపారం చేస్తున్నారు. రామాంజి కూడా వారిలో ఒకడు. తన తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూడ్డానికి సొంత గ్రామానికి వెళ్లి మంగళవారం రొళ్లకు తిరుగు ప్రయాణమయ్యాడు. మడకశిరకు చేరుకోగానే తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. కొంత మంది ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు రాగా, అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణింపు

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం: సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణించగలుగుతారని యువతకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో 40 రోజుల పాటు 'శ్రీసత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ'ని విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజేతలకు మంగళవారం ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రోఫీలు, బహుమతుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. శ్రీసత్యసాయి, ఫాదర్ ఫెర్రర్, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సంస్మరణార్థం మెగా క్రికెట్ టోర్నీ నిర్వహించినట్లు



విజేతగా నిలిచిన ఇటుకలపల్లి జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

గుర్తు చేశారు. భగవంతుడు పంపిన దూతలా స్పెయిన్ నుంచి ఇక్కడికి వచ్చి కరువు పీడిత ప్రజల భవిష్యత్తు కోసం ఎంతో శ్రమించి సాయం చేసిన మహనీయుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని కొనియాడారు. జిల్లాలో తాగునీటి పథకాలకు ఆద్యుడు భగవాన్ శ్రీసత్యసాయి బాబా అని అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఎంతో మంది నిరుపేదల ప్రాణాలు కాపాడారన్నారు. వీరిద్దరి సేవలకు కొనసాగింపుగా జిల్లాకు తాగు, సాగునీరు తీసుకరావడం, ఆరోగ్యశ్రీ , ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత కరెంట్ అందించి లక్షలాది మందికి అండగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కొనియాడారు. వీరందరి పేరుతో నిర్వహించిన టోర్నీలో మూడు వేల మంది క్రీడాకారులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. టోర్నీ నిర్వహణలో ఆర్డీటీ సహకారం మరువలేనిదన్నారు. టోర్నీ నిర్వహణకు తోడ్పాటు నందించిన ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్ సేవలను కొనియాడారు. అనంతరం టోర్నీ విజేతగా నిలిచిన ఇటుకలపల్లి జట్టుకు రూ.1.20 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన చెన్నేకొత్తపల్లి జట్టుకు రూ.60 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 15 వేలు అందించారు. టోర్నీలో పాల్గొన 191 జట్లకు క్రికెట్ కిట్లను అందజేశారు.

ప్రశాంతంగా హెచ్‌ఎం పదోన్నతుల కౌన్సెలింగ్

రాప్తాడురూరల్: స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు నిర్వహించిన కౌన్సెలింగ్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. అనంతపురం సైన్స్ సెంటర్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 53 మందికి గాను ఒకరు నాట్ ఆప్టెడ్ ఆప్షన్ ఇచ్చారు. తక్కిన 52 మంది పదోన్నతులు పొందారు. పదోన్నతులు పొందిన టీచర్లను డీఈఓ అభినందించారు. కొత్త పాఠశాలల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా చూడాలని కోరారు. ప్రణాళిక ఏర్పాటు చేసుకుని పిల్లల చదువుపై దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ పాఠశాలకు మంచి పేరు తెచ్చేలా కృషి చేయాలని సూచించారు. విద్యాశాఖ ఏడీ కృష్ణయ్య, సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా అశోక్‌కుమార్ రెడ్డి

- అధికార ప్రతినిధిగా ఓబుళపతి



అశోక్‌కుమార్‌రెడ్డి



ఓబుళపతి

రాప్తాడురూరల్: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరికి కీలక పదవులు వరించాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా పి.అశోక్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధిగా కె.ఓబుళపతిని ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం తాడేపల్లిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌టీఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి విద్యాభివృద్ధి కార్యక్రమంలోనూ వైఎస్సార్‌టీఎఫ్ భాగస్వామ్యమై పిల్లలకు ఆ ఫలాలు అందేలా చూడాలని వక్తలు కోరారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పలువురికి చోటు కల్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు, అధికార ప్రతినిధితో పాటు ఉపాధ్యక్షులుగా గోవిందరెడ్డి, హెచ్.గిరిధర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, జంషీద్, కార్యదర్శులుగా శివయ్య, వెంకటరమణ, గంగాధర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు

పుట్టపర్తిటౌన్: ఇస్రో అంత్యత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3లో భాగంగా ఈనెల 13న శ్రీహరికోటలో సతీస్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి సాయంత్రం 5 గంటలకు రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపనుంది. రాకెట్ లాంచింగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించే వారి కోసం ఈనెల 13న జిల్లాలో అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 13వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు పుట్టపర్తి, కదిరి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, ధర్మవరం డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. శ్రీహరికోటకు వెళ్లడానికి ఆసక్తి ఉన్న పాఠశాల, కళాశాలల విద్యార్థులు 5 రోజుల ముందుగా తమ పేరు, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ తదితర వివరాలను ఇస్రో వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. 50 మంది బ్యాచ్‌గా బుక్ చేసుకుంటే అదనపు బస్సులు కూడా నడుపుతామని పేర్కొన్నారు.

99 శాతం పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో 2,62,022 మంది పెన్షన్ లబ్ధిదారులుండగా, వీరి కోసం ప్రభుత్వం రూ.72,76,04,500 విడుదల చేసింది. తొలి మూడు రోజులు ఇంటింటికీ తిరిగి 'వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తం అందజేసిన వలంటీర్లు నాలుగోరోజు మంగళవారం సుదూర ప్రాంతాల్లోని లబ్ధిదారుల చెంతకే వెళ్లి పింఛన్ కానుక మొత్తం అందజేశారు. ఫలితంగా నాలుగో రోజు మంగళవారం నాటికి జిల్లాలోని 2,58,374 మందికి రూ.71,74,95,000 పంపిణీ చేసి99 శాతం పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. పింఛన్ పంపిణీకి బుధవారం వరకూ గడువు ఉందని, మిగతా ఒక శాతం లబ్ధిదారులకూ అందిస్తామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- దైవ దర్శనానంతరం వస్తుండగా ఘటన

గోరంట్ల: అరుణాచలంలో దైవ దర్శనానంతరం తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఘటన చోటుచేసుకుంది. సీఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు.. సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఉప్పర రామాంజనమ్మ (45), అనిత, అశోక్, రామకృష్ణప్ప తదితరులు గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొనడానికి కారులో తమిళనాడు రాష్ట్రం అరుణాచలానికి మూడు రోజుల క్రితం వెళ్లారు. సోమవారం తెల్లవారుజాము తిరిగి వస్తుండగా, పాలసముద్రం సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన రామాంజనమ్మ ఘటనాస్థలంలోనే ప్రాణాలు విడిచింది. గాయపడిన అనిత, కారు డ్రైవర్ అశోక్, రామకృష్ణప్పను 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



ఘటనాస్థలంలో రామాంజనమ్మ మృతదేహం

జోరుగా కల్తీ కల్లు విక్రయాలు!

- కల్తీ కల్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని విజిలెన్స్ అధికారులు ఇటీవల అరెస్టు చేసి హిందూపురం సెబ్ పోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తి ప్రతి నెలా అనంతపురంలోని ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపేవాడని తెలిసింది. డబ్బు పంపుతున్నా అరెస్టు చేయడం ఏంటని పోలీసులతోనే వాదించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సదరు ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు ఫోన్ పే ద్వారా నగదు పంపినట్లుగా ఉన్న క్లిప్పింగ్ సామాజిక మాధ్యమాల్లో వైరలైంది.
- హిందూపురం మండలం చౌళూరు గ్రామ సమీపంలో కల్లు దుకాణాలు పదికి పైగా వెలిశాయి. ఇక్కడ కేవలం రెండింటికి మాత్రమే ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు ఉన్నాయి. ఎక్సైజ్ శాఖలోని కొందరికి మామూళ్లు ముట్టజెప్పి అనధికారికంగా కొందరు వ్యాపారులు ఇక్కడ కల్లు అమ్ముతున్నారనే విమర్శలు ఉన్నాయి.

- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ పోలీసులు
- నెలవారీ మామూళ్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు

సాక్షి, పుట్టపర్తి: ఎక్సైజ్ పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలవారీ మామూళ్లు తీసుకుంటూ అనధికారికంగా కల్తీ కల్లు దుకాణాలకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే దందా జరుగుతోందని కింది స్థాయి ఉద్యోగులు చెబుతున్నారు. కల్లు దుకాణాల విషయంలో లంచం ఇచ్చిన వారికి అనుమతులు ఇవ్వడంతో పాటు ఎన్ని దుకాణాలు అక్రమంగా నిర్వహించినా పట్టించుకోవడం లేదని విశ్వసనీయ సమాచారం. ఒకరిద్దరు చేస్తున్న తప్పిదాలతో మొత్తం విభాగానికే మచ్చ వస్తోంది. ఈ క్రమంలోనే ఫోన్ పే ద్వారా నగదు పొందినట్లుగా చెబుతున్న కానిస్టేబుల్‌ను సంప్రదించగా.. తాను ఎలాంటి తప్పు చేయలేదని తెలిపాడు. ఎక్సైజ్ శాఖలో కొందరు ఉన్నతాధికారుల సూచన మేరకే అనధికారిక కల్లు దుకాణాలు నిర్వహిస్తున్నారని చెప్పాడు. తనకు ఫోన్ పే ద్వారా డబ్బు పంపిన వారెవరో ముందుకు రావాలని కోరాడు.

విచారణ చేయిస్తాం



ఎక్సైజ్ శాఖలో అవకతవకలకు పాల్పడినట్లు రుజువైతే చర్యలకు సిఫారసు చేస్తాం. ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్‌పై విచారణ జరుగుతోంది. వాస్తవమని తేలితే చర్యలు తప్పవు. అనధికారికంగా నిర్వహించే కల్లు దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. అన్నీ సక్రమంగా ఉన్న వారికే అనుమతులు ఇస్తున్నాం.

– రమేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పుట్టపర్తి

విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి

గుడిబండ: మండల పరిధిలోని పీ.ఎస్.పాళ్యం గ్రామానికి చెందిన నాగవేణమ్మ(48) మంగళవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. పీ.ఎస్.పాళ్యం గ్రామానికి చెందిన నాగవేణమ్మ, నాగరాజు దంపతులు. మంగళవారం మధ్యాహ్నం నాగవేణమ్మ పొలం దగ్గరకు వెళ్లింది. బోరుబావి వద్ద కింద పడి ఉన్న విద్యుత్ స్టార్టర్‌ను పైకి పెట్టేందుకు యత్నించింది. ఈ క్రమంలోనే విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పక్క పొలం వారు విషయాన్ని భర్తకు తెలిపారు. నాగవేణమ్మ మృతదేహం వద్ద ఆయన కన్నీరుమున్నీరయ్యాడు. విద్యుత్ శాఖ ఏఈ విశ్వనాథ్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురికీ వివాహమైంది.

పీహెచ్‌సీ తనిఖీ

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి ఎస్‌వీ క్రిష్టారెడ్డి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కుష్టువ్యాధి నిర్ధారణ సర్వే పై ఆరా తీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశా యాప్ ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, అందులో ఏయే సర్వీసులు అందుబాటులో ఉన్నాయో సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ గణేనాయక్, డాక్టర్ దీప్తిరెడ్డి, సీహెచ్‌ఓ రామాంజులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం ఏర్పాటుకు దరఖాస్తులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల కోసం పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ రసూల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన స్వచ్ఛంద సంస్థలు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్వ అనుభవం, ఇతర ప్రాజెక్టుల వివరాలు, కనీసం 3 సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్‌ను దరఖాస్తుకు జతపరచి.. ఈ నెల 12 సాయంత్రం 5 గంటలలోపు అనంతపురం బుడ్డప్పనగర్‌లోని విభిన్న ప్రతిభావంతులు,హిజ్రా,వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయానికి దరఖాస్తులు పంపాలన్నారు. కేంద్ర న్యాయ సాధికారత శాఖ సౌజన్యంతో కేంద్రాన్ని నెలకొల్పనున్నట్లు పేర్కొన్నారు.